# గాజుబొమ్మలు



పవని నిర్మల ప్రభావతి

జీవన్ దగ్గర్నుండి వచ్చిన ఉత్తరం చదివి నిర్ఘాంతపోయాను.

"ప్రియమైన కృష్ణా,

నేను పిల్లలిద్దరినీ మా గ్రామంలో వదిలిపెట్ట దలిచాను. అక్కడీ మధ్య "ప్రకృతి బాల ఆశ్రమం" నొకటి పెట్టారు. నియమితమైన క్రమశిక్షణ, విపరీతమైన స్వేచ్ఛ వారి కక్కడ లభిస్తుంది. పిల్లలవెంట మా విధవ అక్కయ్య వుంటుంది. పిల్లలిద్దరికయ్యే ఖర్చు నేను భరిస్తా నెలాగూ....

పిల్లల్ని అక్కడ వొదిలిపెట్టి వస్తూ, మీ యింట్లో దిగి, ఒకపూట నీతో గడిపి, తిరిగి ఢిల్లీ వచ్చేస్తాను....

నీ ప్రియస్నేహితుడు,

"జీవన్."

"ఎవరిదగ్గర్నుంచి ఉత్తరం?"

విజయ ఎప్పుడొచ్చిందో, అడుగుతోంది.

"జీవన్ దగ్గర్నుంచి." ముక్తసరిగా అన్నాను.

"జీవన్‌బాబుగారి దగ్గర్నుంచా?"

విజయ కళ్ళు మెరిశాయి క్షణకాలం. ఆ "బాబు" అన్న పదం ప్రత్యేకమైన వ్యక్తుల....ముఖ్యంగా బాగా డబ్బున్న వారి విషయంలో మాత్రమే వాడుతుంది విజయ!

"ఊ!"

"ఏం వ్రాశారు?"

"తన పిల్లలిద్దరినీ వాళ్ళగ్రామంలోని బాల ఆశ్రమంలో వదులుతాడట. ఆ సందర్భంలో వీలైతే ఇక్కడ దిగి వెళతానని వ్రాశాడు?"

విజయ కళ్లు విప్పార్చి చూసింది. ఏదో నమ్మకూడని విషయం వింటున్నట్లున్నా యామె చూపులు.

"లక్షణంగా ఢిల్లీలో వున్నవాళ్లు! కాన్వెంటులో ఎంత డబ్బయినా ఖర్చు పెట్టి చదువు చెప్పించగలవాళ్లు....నీట యిన డ్రెస్సులతో ఫ్రిజిడేర్‌లోని తాజా పళ్ళలా....నవనవలాడేలా పిల్లల్ని వుంచ గల స్థితిలో వున్నవాళ్లు....వున్నది ఇద్దరు మగ పెధవలు! ఈ దుర్బుద్ధేమిట? ఎక్కడో గ్రామంలో వాళ్ళని వదిలెయ్యట మేమిటి? జీవన్‌బాబుగారికి ఆలోచన లేక పోతే, ఆయన భార్య మంజులకైనా లేక పోయిందా? ఏమిటో....డబ్బు ఎక్కువగా వున్నవాళ్ళకి....కొన్ని పైత్యాలుంటా యేమో!"

"పైత్యాలు డబ్బు ఎక్కువగా వున్న వాళ్ళకేకాదు. తక్కువగా వున్నవాళ్ళకి కూడా వుంటాయి. ఎటొచ్చీ తమకు పైత్యం వున్నట్లు ఒప్పుకోరు అంతే!" అన్నాను విజయవేపు చూస్తూ.

విజయ కొక్కసారిగా కోపంపొంగుకు వచ్చింది.

"మధ్యలో మన విషయాలెందుకు ప్రస్తావిస్తారు! బహుశా మీ స్నేహితు డైనందుకు, జీవన్ బాబుగారిక్కూడా, రాస్తో కూస్తో, మీ సిద్ధాంతాలు అంటుకుని వుండి వుంటాయి. ఏమైతే నా కెందుకు? ఆయన నారెప్పుడొస్తారో చెబితే, తగిన ఏర్పాట్లు చేస్తాను" విసురుగా లోపలికి వెళ్ళిపోయింది విజయ.

విజయ మాటలతో నాలో విపరీతంగా ఆలోచనలు ముసురుకున్నాయి. జీవన్ ఎందుకిలా చేస్తున్నాడు? నాలాటి ఆలో చనలతోనే జీవన్ వున్నాడా? అవి ఆచ రణలో పెట్టడాని కుద్యుక్తుడైనాడా? మరి నే నెందుకు ఆచరణలో పెట్టలేక పోతున్నాను!

మనస్సంతా చిలికినట్లవుతోంది....గత మంతా గిరగిర తిరుగుతోంది.

* *

చిన్నప్పట్నుంచీ "క్రమశిక్షణ" అంటే నాకు పరమ అసహ్యం. ఆ పేరుతో పెద్ద వాళ్ళు పిల్లల్ని ఎలా యంత్రాలుగా మలి చేదీ నాకు తెలుసు. మా నాన్నగారి క్రమ శిక్షణ అంతా ఇంతా కాదు! అమ్మ సరే సరి! జమీందారీలు పోయినా, ఆ లక్షణాలు అరువు తెచ్చుకున్న కుటుంబం నుంచి వచ్చిందామె. "క్రమశిక్షణ" అన్నమాట ఆమె శ్వాసలో ఒక భాగమైపోయింది! బహుశా నాన్నగారి క్కూడా "క్రమ శిక్షణ" ఆమె నుంచి సంక్రమించిన జబ్బై వుండాలి!

వాళ్ళిద్దరికీ నే నొక్కడినే "ఎర" గా దొరికాను! అంతే! ఆ స్తమానూ కాల్చుకు తినేవాళ్లు! ఎండలు మండిపోతూ, జోరు చెమటలు కారిపోతున్న రోజుల్లోనయినా సరే, మోకాళ్ళవరకూ మేజోళ్లు వుండి తీరాలి! వంటయింట్లో నయినాసరే జోళ్ళు విప్పకూడదు! ఇస్త్రీ మడతలు నలక్కూ-

తదు! ఇరుగుపొరుగు పిల్లలతో ఆడుకో కూడదు - బట్టలు, వొళ్ళూ మట్టి అవు తుందట పొరబాటుగానయినా....సోఫాలో తప్ప....గచ్చునేలమీద కూర్చోకూడదు! ఎండలోకి పోకూడదు ...వానలో తడవ కూడదు ...ఎక్కువగా నవ్వకూడదు ... ఇలా ఎన్నో ఇంకెన్నో!....

అందుకే నాకది ఏనాడూ "మాఇల్లు" అనిపించలేదు. ఖర్మవశాత్తూ త్రోయబడిన జైలు అనిపించేది! తర్వాత కాన్వెంటు చదువు....మా ఇంటికీ, ఆ స్కూలుకూ తేడా తెలీలేదు నాకు!

కాలేజీలో చేరాక కొంచెం ఊపిరి నలిపినట్లయ్యింది. అప్పుడే కొంచెం "ఫ్రీగా" మాట్లాడటం నేర్చుకున్నాను.. అదయినా "జీవన్" ధర్మమా అని!

టౌన్ బయట వున్న చెరువుదగ్గరకు షికారుకు వెళ్ళేవాళ్ళం నేనూ జీవన్ చెరువు గట్టున వున్న పెద్ద మర్రిచెట్టు చివరలకు ఎక్కి, ధభీమని నీళ్ళలో దూకి, ఈత కొట్టేవాడు జీవన్!

"నువ్వూ రా కృష్ణా! నీకు నేను నేర్పుతాను!" అనేవాడు!

కానీ నాకు నీళ్ళంటే చచ్చే భయం! చిన్నప్పుడు తోటిపిల్లలతో "ఈత" నేర్చుకోవాలని ఉబలాట పడినందుకు.... నిక్కరు, చొక్కా తడిసిందని....నీళ్ళ దగ్గర వున్నానని....కబురుతెలిసి, నాన్న గారు "క్రమశిక్షణ" పేరుతో అలాటి వెధవ వేషాలు వెయ్యవద్దని నన్ను చావ

కొట్టిన సంఘటన నాకినాడూ గుర్తుంది!

"వుహూ! నాకు రాదు!" అనే వాణ్ణి.

"నేర్పుతాగా!"

"వూహూ! నాకు భయం!"

జీవన్ నన్నుచూచి జాలిపడేవాడు....

"కృష్ణా! చాలా జాగ్రత్తగా పెంచు తున్నామనే భ్రమతో ...మీవాళ్ళు నిన్నెం దుకూ కొరగానివాడిగా.... పిరికిపందగా జీవితంలో ఏవి ముఖ్యమైనవో అవి నేర్పకుండా....గాజుబొమ్మలా తయారు చేశారురా!" అనేవాడు! ఆ క్షణంలో నేనెంత పనికిమాలినవాణ్ణో నాకు స్పష్టంగా తెలిసిపోయింది!

కాలేజిలో చేరిన కొత్తలో, సీనియర్ విద్యార్థులు కొందరు నన్ను అల్లరి పెట్ట డానికి వచ్చి....చక్కలిగిలి పెట్టసాగారు.. నవ్వి, ఏడ్చి, సొమ్మసిల్లి పడిపోయే సమ యంలో, జీవన్ సుడిగాలిలా వచ్చాడు. .. ఆ విద్యార్థులు ముగ్గుర్నీ బూతులుతిడుతూ తన్నాడు ... అదో పెద్ద గొడవై పోయింది....ఎలాగో ప్రిన్స్‌పాల్ సర్దు బాటు చేశారు తర్వాత.

"కనీసం ప్రతిఘటించటమైనా చేత రాదా నీకు కృష్ణా!" అంటూ విరుచుక పడ్డాడు జీవన్. .

నాకు నామీద అసహ్యం వేసింది! నిజమే! ఎర్రగా, భారీగా వున్న నాలో.... కనీసం—ఎదుటివాడు నన్ను తన్న బోతుంటే. శక్తిమేరకు నన్ను రక్షించు

కోవాలన్న కనీసం సజ్ఞానమన్నా ఎందుకు లేకపోయింది?

దీనికి కారణమేమిటి?

అందుకు జవాబు, యథాలాపంగా ఓ రోజు జీవన్ చెప్పాడు.

"నువ్వే కాదురా కృష్ణా! నీలాటి వాలామంది వున్నారీనాడు! మీరు పెరిగిన "క్రమశిక్షణ" ఎలాటిదంటే, ఎవరేనా మీకు అన్నీ అమర్చిపెడితే—అనుభ వించగలరేగానీ ...జీవితావసరాలు, జీవి తాని క్కావలసినవి అమర్చుకోవటం, సాధించుకోవటం ఎలా? అన్నది మీకు చేతరాదు.... అసలుతోచదు.... ప్రకృతి శక్తులను ఎదుర్కొనే శక్తి మీకులేదు.. అంచేత మీకు ఆత్మరక్షణ కూడా రాదు

జీవన్ సాహచర్యంలో నేను మాన సికంగా చాలా ఎదిగాను— "జీవన్! మరి నీకు ప్రకృతితో సాన్నిహిత్యం ఎలా ఏర్పడిందిరా? మా కాన్వెంటులో మాదిరిగా, మీ వూళ్ళో, మీ నౌకర్లూ, ఆయాలూ మిమ్మల్ని పిక్నిక్కు తీసికెళ్ళే వారా? స్విమ్మింగ్‌పూల్‌లో 'డైవ్స్' వేసి దింపేవారా, "డాగ్" "బుల్" "బర్డ్స్" చూపేవారా?" అన్నా నోరోజు కుతూహలంగా!

నా ప్రశ్న విని జీవన్ విరగబడి నవ్వాడు....నవ్వీనవ్వీ, అలసిపోయి, ఎలాగో నవ్వు ఆపుకున్నాడు.


"కృష్ణా మాకు నౌకర్లూ లేరు. ఆయాలూ లేరు! స్వచ్ఛమైన తెలుగులో.. ఎద్దులు. ..ఆవులు ...కుక్కలు, పిల్లులు.. వీటన్నిటిమధ్య పెరిగాం.... హాయిగా మాతృభాషలో "కుంకా, వెధవ...." ఇంకా పెద్ద పెద్ద తిట్లూ తిట్టుకుంటాం.. ఓసారి మా వూరురా! నీకు తెలుస్తుంది!" అన్నాడు.

ఆసారి శలవులకు....ఇంటికి వెళ్ళ కుండా, జీవన్‌తో బాటు వాళ్ళ వూరికి వెళ్లాను. జీవన్ తలిదండ్రులేమంత కలిగిన కుటుంబంవారు కారు. కానీ మర్యాదలేని మనుషులు మాత్రం కారు.

జీవన్‌కు ముగ్గురు తమ్ముళ్ళూ! ఇద్దరు చెల్లాయిలూ వున్నారు. ఇంటిచుట్టూరా గేదెలూ, ఎద్దులూ, ఆవులూ వున్నాయి! అందరికందరూ ఇంటిపని, పొలం పని చేస్తారు. నేలమీద కూర్చునే భోజనం చేస్తారు. జీవన్ తమ్ముళ్ళు....ఆఖరువాడు పదేళ్ళవాడు.... పెద్ద భావిలోకి ధభీమని దూకి.... పెల్లికిలా పడుకుని ..నీటిలో మునిగి....రకరకాల మొగ్గలు వేస్తూ ఈదులాడాడు!

ఉదయం, సాయంత్రం స్నానాలు చేస్తారు....ఈలోగా బట్టలు మురికైనా, జీవన్ తల్లి తిట్టదు....కొట్టదు. అస్త మానూ జోళ్ళు వాడరు!

ఆసాయంత్రం వాళ్ళలోగిలిలో కని పించిన పెద్దపామును జీవన్ చెల్లాయి కర్రతో కొట్టి, కర్రమీద వేసుక వచ్చింది! చచ్చిన పామును చూస్తుంటేను నాకు కాళ్ళలో వణుకు పుట్టింది! నాపదహారో




ఏట కాబోలు....పెరట్లో, నూతి గట్టున కనిపించిన ఓ మూరెడు పొడువుపాము కనిపిస్తే....నాన్నగారూ, అమ్మా, నేనూ కేకలువేసి....నౌకర్లను పిలిచాం ...వాళ్ళు ఇద్దరుకలసి పామును చంపు తూంటే, మేం ముగ్గురం ...వంట ఇంటి గడపలో జాగ్రత్తగా నిల్చున్నాం....ఏ మాత్రం పాము ఇటు తిరిగినా....లోపలికి పరుగెత్తి, తలుపులు వేసుకోవటానికి వీలుగా! (అదినీటిపామని చెప్పారు ఎవరో తర్వాత!)

జీవన్ రెండో తమ్ముడు పధ్నాలుగేళ్ళవాడు ఆరు మండ్రగబ్బల్ని, రెండు తేళ్లనీ కొండీలకు దారం కట్టి చేతిలో పట్టుక వచ్చాడు!

"రాక్షసవెధవా! వాటి నెందుకు పట్టావ్?" అంటూ కోప్పడింది జీవన్ తల్లి... వాడునవ్వేశాడు.

"అవును! ఎలా పట్టావురా?" అన్నానేను కుతూహలంగా!

"ఏముందీ: ఆరుబయలు .... బోరియలో నీళ్ళు పోస్తాను ... తేళ్ళు .... మండ్రగబ్బలూ బయటకువస్తాయి.... నల్లేరుకాడవాటి కొండీల దగ్గర పెడతాను. దాన్ని అవికుడతాయి. నల్లేరు కాడనల్లగా పోతుంది విషంతో! ఇక ఆ తేళ్లకు తిరిగి కొండీలలో విషం కూడ టానికి కొన్ని గంటలు పడుతుంది! ఈలోగా అవిమనల్నెన్నిమార్లు కుట్టినా విషం ఎక్కదు.... పట్టుకుని దారం కడతాను!' అన్నాడు వాడు అదేదో అతి సాధారణమైన విషయమన్నట్లు!

ఇదేదో కొత్త లోకం లావుందినాకు। ఆ నల్లేరేమిటో....నాకు తెలీదు....అసలు తేలు బొమ్మంటేనే నా ఒళ్ళు జలదరి స్తుంది....పిల్లలు వెర్రిగోల చేస్తుంటారు. చింతచెట్లు, తాటిచెట్లు ఎక్కుతారు.... పడతారు, లేస్తారు....దెబ్బలు తగులు తుంటాయి. బొప్పులు కడుతుంటాయి. కాస్తంత నీరు సున్నంరాసు కుంటుం టారు. కాస్సేపు ఏడ్చి వూరు కుంటారు ఇష్టంవచ్చినట్లు....ఈతకాయలు ... తాటి కాయలు....తింటారు ...ఎక్కడా కట్టు బాటు లేదు ...

"ఇలా పిల్లలు అల్లరిచేస్తే . .మట్టిలో పొర్లాడితే....మీరు ఏమీ అన రా పిన్ని గారూ। వాళ్ళకు జబ్బులురావా ? "అన్నాను జీవన్ తల్లితో....

ఆమెనవ్వింది. "ఈ వయసులో గాక పిల్లలు అల్లరిచేసేదెప్పుడు నాన్నా కృష్ణా ? అన్నీ నేర్చుకొనే వయసిది.... ఎవరికేపనిలో ఉత్సాహం వుంటే.... వాళ్లాపని నేర్చు కుంటారు....మీ అంత య్యేక....ఇప్పుడు నువ్వూ, జీవన్ అల్లరి చేస్తున్నారాచెప్పు ? ఈలోగా వాళ్ళకు వాళ్ళకు లేనిపోని ఆంక్షలుపెట్టి....కమ్మటి ఆ చిన్నతనపు హాయినెందుకు పోగొట్టాలి నేను ? పడితే పడతారు....వాళ్లేలేస్తారు .. తన్ను కుంటారు....తిట్టు కుంటారు ... వాళ్లే తిరిగి ఆడు కుంటారు:"

నా కదోమహా విశ్వ విద్యాలయంలా కనిపించింది। నాలాటి నిర్భాగ్యులను.... అన్నీవున్నా.... ఏమీరాని దౌర్భాగ్యు లనూ....ఈవిద్యాలయంలో వేస్తేచాలు.. వాళ్ళు నిజమైన మనుషులుగా తయా రౌతారు....అనిపించింది....

చదువులు పూర్తయి....జీవన్ ఢిల్లీకి వెళ్ళి పోయాడు....చిన్న ప్రైవేటు కంపెనీలో "మెకానిజం"కు సంబంధిం చిన ఓ చిన్న ఉద్యోగంలో చేరాడు.... పెళ్లాడాడు....తనమేనత్త కూతురినే ... అతగాడికిడబ్బు సంపాదించాల్సిన అవ సరంవుంది.. .మిగతా కుటుంబం అతని మీద ఆధారపడివుంది. నాకువిజానికి ఉద్యోగం చేయాల్సిన అవసరంలేదు.... కానీ వ్యాపకం అంటూ వుండాలి కాబట్టి రెండోది మానాన్నగారు ఈ మధ్యే చని పోవటంవల్ల....అమ్మ ఆస్తులు మేనేజ్ చేసుకుంటూ అక్కడే వుండి పోవటం వల్లా....ఇకఅమ్మ దగ్గరే వుంటే, ఆమె "క్రమశిక్షణ" పాఠాలు జీవితాంతం నేర్చుకోవలసి వుంటుందేమోనన్న భయం వల్లా ...ఇక్కడ ఉద్యోగంలో చేరాను... చెప్పుకో కూడదుగానీ, జీతం చాలా ఎక్కువే।

ఏరి, కోరి, అమ్మకు కూడా నచ్చటం వల్ల . ..విజయ అర్ధాంగిగా వచ్చింది. చదువూ, సంస్కారమూ, అందమూ, తెలివీ సమపాళ్ళలోవున్న విజయ ... నాకు ఎంతగానో నచ్చింది ...

"మనకు పుట్టబోయే పిల్లల్ని మనం ప్రత్యేక పద్ధతులలో పెంచాలి విజయా?"

అంటూ నా ఆదర్శాలు (నేచేయలేనివి.... నాకు చేతరానివి) చెప్పేవాణ్ణి....

విజయ విస్ఫారిత నేత్రాలతో నాకేసి చూస్తూ వింటూండేది .... విజయ నా భావాలతో ఏకీభవిస్తుందనీ, నాకు సహకరిస్తుందనీ గంపెడాశ పెట్టుకున్నాను ...

కానీ .... బాబు పుట్టాక ...వాడు పెరుగుతున్నకొద్దీ, తిరిగి పాప పుట్టాక.. దానికి ఏడాది నిండే సరికి ...నాకర్థమై పోయింది।

'యూకాంట్ రన్ అవే ఫ్రమ్ఇట్।'' అన్నట్లు ...నేనే ''క్రమశిక్షణ'' నుంచి తప్పించు కోవాలనీ, నాపిల్లల్ని తప్పించాలనీ చూశానో ...అదేవేయి నాలుకలతో విజయలో ప్రవేశించి మాచుట్టూరా పరచుకుంది।....నిజానికి విజయలో స్వతహాగా అంతటి పట్టుదలా, పద్ధతులూ లేవు। కానీ....విజయ అన్నయ్య రామారావు, వదిన లతల పుణ్యమని, ఆమెకా జబ్బు వచ్చేసింది। నా బావమరిది రామారావు, నాకు పెళ్ళయ్యేసరికి గుమాస్తాగా వుండేవాడు। మాబాబు పుట్టే సమయానికి . . అతగాడు గుమాస్తా గిరికి రాజీనామా ఇచ్చి, ఏదో చిన్న వ్యాపారం మొదలెట్టాడు.... సిరివరించింది .... మాకుపాప పుట్టేసరికి ... రామారావు ''డబ్బుగలవాడిగా'' పేరుతెచ్చుకున్నాడు। రామారావు లతల అంతస్థు మారిపోయింది. పద్ధతులు మారిపోయాయి....

ఓసారి వాళ్ళ ఆహ్వానం మీద నేనూ, విజయా పిల్లలూ వెళ్ళాం. అంతే తిరిగి వచ్చేసరికి విజయ డూప్లికేట్ ''లత' లా మారిపోయింది। వారానికోమారు లత ఉత్తరం వ్రాస్తుంది విజయకు....

''మీ శ్రీవారికి తిక్కకోపం జాస్తిలా వుంది. మొన్ననే గమనించానులే। బాత్ రూంలో ఐదారు రకాల సోప్స్ పెట్టు.... పిల్లలకూ, మీ వారికీ పూట కోరకం ''సోప్'' వాడుకోవటం అలవాటుచెయ్యి. శీతాకాలంలో పాండ్స్ పౌడర్ వాడు, వేసవి కాలంలో ''ప్రిక్లీహీట్'' వాడు, వర్షాకాలంలో ''క్యుటి క్యూరా'' వాడు. పిల్లలకి మేజోళ్ళు... బూట్లు అలవాటు చెయ్యి. లాగులు, గౌనులు టైట్‌గా కుట్టించు. లొడాయి బుడాయిలా కుట్టించకు డ్రెస్సులు. ఏబ్రాసుల్లా వుంటారు. ''మద్దె'' వెధవలతో ఆడుకోనివ్వకు. మొన్న మీ రిక్కడకు వచ్చినపుడు మీ బాబు పాపని ''....ముండ ...'' అని తిట్టడం విన్నాను ... రాస్కెల్, స్కౌండ్రల్ ....ఫూల్ .... లాటి తిట్లే నువ్వు వుపయోగించు....వాళ్ళకవే వస్తాయి. వెధవతిట్లురావు.

భోజనం తయారుచేసేటప్పుడు నువ్వు ''ఏప్రన్'' కట్టుకో. అన్నం పెట్టేటప్పుడు పిల్లలకు ''ఏప్రన్''లుకట్టు. వాళ్ళని కొత్త నాగరికులుగా తయారుచెయ్యి....''

ఇలా సాగుతుందామె ఉత్తరం. ఆమె ఉత్తరాలంటే నా కసహ్యం. లక్షరీని ఎక్జిబిట్ చేసుకోవాలనే తాపత్రయం

బావుందిగానీ....ఈ పద్ధతిలో నాకు నచ్చదు అందునా పిల్లల విషయంలో.

"ఒక్కమాటలో చెప్పాలంటే మతి లేని వెధవలుగా, మర మనుషులుగా తయారు చెయ్యమంటోంది మీ వదిన....మన పిల్లల్ని!" అన్నాను హేళనగా ఓ ఉత్తరం (పైలాటిదే!) గిరవాటు వేస్తూ.

విజయకు లత పద్ధతులు వేదవాక్కులుగా వున్నా యీ మధ్య! కారణం లత డబ్బు కలది....అతి నాగరికత తెలిసింది అన్న భావమే! నా మాటకు బాగా కోపం వచ్చింది.

"మీ జీవన్ ఒక్కడే మనుషుల్ని సృష్టించగల మహామేధావి." అంది విసురుగా.

నాకు చివుక్కుమంది. కానీ ఏమీ అనలేక పోయాను. విజయకు నచ్చచెప్పటం నా తరంకాదని తెలిసిపోయింది!

జీవన్, తనుచేస్తున్న జాబ్‌తో....తన చొరవతో, సమర్థతతో బంతిని గాలిలోకి తన్నినట్లు పైకి వచ్చేశాడు. ఆరేళ్ళు తిరిగేసరికి లక్షాధికారి అయ్యాడు! ప్రైవేటుగా "మెకానిక్ షాప్స్" ఓపెన్ చేసాడు! ఇప్పుడు ఢిల్లీలో జీవన్ ఒక గుర్తింపదగిన వ్యక్తిగా మారిపోయాడు...

ఓ రోజు నేను కాంప్‌నుండి యింటికొచ్చేసరికి విచిత్రమైన దృశ్యం కంటబడింది. మూడేళ్ళపాపను .... డైనింగు టేబిల్‌మీద కూర్చోబెట్టి, చిన్న గిన్నెలోని, పేస్ట్‌లాటి పదార్థమేదో స్పూన్‌తో పాపనోట్లో పెడుతోంది విజయ. ఆ గిన్నె లాక్కోవాలని పాప మారాం చేస్తోంది.

"పాపకు వొళ్ళు బాగా లేదా విజయా అదేమందు?" అన్నాను కంగారుగా డైనింగ్ టేబిల్‌కేసి వెడుతూ.

విజయ నవ్వింది "భలేవారే! "బేబీ ఫుడ్" ఇది! అసహ్యంగా అన్నం పెడితే వొంటినిండా పడేసుకొంటోంది పాప! ఇదయితే చక్కగా స్పూన్‌తో పెట్టవచ్చు.... నిన్ననే ఓ టిన్ తెచ్చాను....మనకు టైం కలిసొస్తుంది. వాళ్ళు నీట్‌గా వుంటారు."

నేను నిర్ఘాంత పోయాను. చివరకు నోరు, పళ్ళు, చేతులు చక్కగా వున్న పాపకు స్పూన్ ఫీడింగా! ఇక ఈ తరవాత తరం వాళ్ళు ...వాళ్ళ బిడ్డలకి ... ఆహారం ఏ ఇంజక్షన్ ద్వారానో ఇచ్చి కనీసం ఆహారం నోటితో, తినటం కూడా చేతగాని చవటలుగా మారుస్తారా?

"ఏమిటలా ఆలోచిస్తున్నారు! ఈ టిన్స్‌లోని బేబీఫుడ్ 'పాక్' చేయబడింది. ప్యూర్‌గా వుంటుంది కావలిస్తే ఇన్‌స్ట్రక్షన్స్ కంపెనీ వివరాలూ చూడండి!" అంటోంది విజయ.

నేను కుర్చీలో కూలబడ్డాను.

"లేదు విజయా! అవి చాలా బాగా "పాక్" చేయబడ్డ టిన్స్! రేపట్నుంచీ నువ్వూ, నేనూ కూడా పుచ్చుకుందాం. టైం కలిసొస్తుంది. మనకూ నమిలిమింగే బాధ తప్పుతుంది. ఇంకొన్నాళ్లు పోయాక, మనల్నీ మన పిల్లల్నీ "స్ట్రెచర్"ల మీద

నౌకర్లు తిప్పుతారు. అప్పుడు నడిచే బాధ కూడా వుండదు ...''

విజయకు కోపం వచ్చింది. ''మీరనేదేమిటి?'' అంది కోపంగా.

''అర్థం చేసుకో విజయా! ఆదిమానవుడు అతి అనాగరికుడే కావచ్చు.... కానీ అతగాడి ఆత్మ విశ్వాసం ఎంతటిదో తెలుసా? తన స్వశక్తితో.... వన్యమృగాల బారినుంచి తనను తాను రక్షించుకుంటూ, ఆహారం సంపాదించుకునేవాడు.

ఈనాడు మన పిల్లలకు మనం నేర్పుతున్నదేమిటి? వండిన మెతుకుల్ని....తినలేని అర్భకత్వం ..''

నా మాటలు పూర్తికాకముందే విజయ ఛర్రుమంది.... ''మీ సిద్ధాంతాలూ ఓరు మీ జీవన్‌కు చెప్పుకోండి!'

ఇప్పుడు నాకు నేను చిన్నతనంలో పెరిగిన వాతావరణానికీ ఈ నాడు మా ఇంటికీ, మా పిల్లల పెంపకానికీ తేడా కనిపించుటలేదు. అప్పట్లో నేను పాములకూ, తేళ్ళకూ, నీళ్ళకూ భయపడితే, ఇప్పుడు నా పిల్లలు, కుక్కలకూ, పిల్లులకూ, కోళ్ళకూ, చీమలకూ కూడా భయపడ్తున్నారు! రంగువేసిన మట్టి బొమ్మల్లా పెరుగుతున్న నా పిల్లల్ని తలుచుకున్నకొద్దీ నాకు బాధా జాలి కలుగుతుంటాయి.

ఆ మధ్య ఓ వివాహానికి గ్రామం వెడుతూ పిల్లలనూ, విజయనూ పిల్చి కెళ్ళాను. విజయ ఎంత కట్టుదిట్టం చేసినా పంజరం నుంచి బయటపడ్డ పక్షుల్లా పిల్లలు, మిగతా పిల్లలతో ఆటలకూ, పాటలకూ ఎగబడ్డారు.

''అంతే, తిరిగివచ్చాక విజయ వాళ్ళకు పూటపూటా ''డెట్టాల్' వాటర్‌తో, శాండల్‌వుడ్ ఆయిల్ వేసిన వాటర్‌తో స్నానాలు చేయించింది! నేలమీద భోజనాలు చేయటానికి కూర్చోవటంవల్లా, భోజనం చేసినందువల్లా, నేలమీద దుమ్ము వాళ్ళ పొట్టలో ఇంకిపోయి, కడుపులోకి పోయివుంటుందనీ.... లోపల.... సెప్టిక్ అయివుంటుందనీ....బాధపడింది....వాళ్ళిద్దరినీ ''స్టెరిలైజ్'' చేసినంత పని చేసింది!

ఇక లాభం లేదు....నా పిల్లలు.... నేను అనుకున్న విధంగా ఏనాడూ తయారు కారు....

జీవన్‌కు బాగా డబ్బు వచ్చిందని తెలిశాక. ..విజయ జీవన్‌ను ''జీవన్‌బాబు'' అంటోంది. వెనకటిలా,''మీ జీవన్....మీ జీవన్'' అంటూ ఎత్తిపొడవటం లేదు.

''జీవన్‌బాబు....పెద్ద కాన్వెంటులో చేర్పిస్తారేమో ఆయనగారి పిల్లలిద్దర్నీ! మంచి ఆంగ్లో ఇండియన్స్‌ను పెట్టి ట్యూషన్ చెప్పిస్తారేమో....లేక ఫారిన్ పంపేస్తారేమో.... ఎంతైనా ఫారిన్‌లో పిల్లల పెంపకమే వేరు! మనదేశం.... మన వెధవ పద్ధతులు. . అక్కడుండవు.. ఇంకా మనబోటివాళ్ళం....మా లతపదిన, అన్నయ్యలాటివాళ్ళూ కొందరున్నారు

కాబట్టి....ఇతర దేశస్తు లెవరేనావచ్చినా.. ముచ్చటగా వుండే మన పిల్లల్ని చూచి, వెక్కిరించటానికి వెనుకాడుతున్నారు గానీ....లేకుంటే....వెర్రి వెంగళాయిల్లా ....ఎడ్డిమడ్డిగా వుండే పిల్లల్ని చూచి విరగబడి నవ్వరూ!'' అంటూంటుంది విజయ తరచుగా....

* * *

''ఇంకా మీరిక్కడే కూర్చుని వున్నారేం? భోజనానికి రాండి!'' అంటూ వచ్చింది విజయ....సుమారు ఓ గంట సేపుగా....గతమూ, వర్తమానమూ కల గాపులగంగా ఆలోచిస్తున్న నా ఆలోచన లకు ఫుల్‌స్టాప్ పడిపోయింది.

''అన్నట్లు జీవన్‌బాబుగా రెప్పు డొస్తారూ?'' అంది తిరిగి విజయ....

''రేపో....ఎల్లుండో!'' . భోజనానికి లేచాను. రెండు రోజుల తర్వాత జీవన్ వచ్చాడు....మనిషి కొంచెం లావెక్కాడు. సరదాగా ఎన్నో సంగతులు మాట్లాడు కున్నాం....

''అంకుల్.... అంకుల్'' అంటూ మా పిల్లలిద్దరూ జీవన్‌తో చిలకపలుకులు పలికారు....వాళ్ళమ్మ చెప్పిన మేరకు!

''అంకుల్ ఏమిట్రా మీ బొంద.... మామయ్యనురా!....'' అన్నాడు జీవన్ నవ్వుతూ....నావేపు తిరిగి ''వీళ్ళనీ నీ డూప్లికేట్స్‌గా తయారుచేస్తున్నావు కదూ?'' అన్నాడు.... తప్పులు చేసినట్లు తల వంచుకున్నాను....విజయ కోపా న్నణుచుకుంటూ పని వున్నట్టు లోపలికి వెళ్ళిపోయింది.

''ఇంతకూ నీ పిల్లల సంగతేమిటీ? గ్రామంలో వదిలివచ్చావా?'' అన్నాను టాపిక్ మారుస్తూ. విజయకూడా వచ్చి కూర్చుంది....కుతూహలంగా వింటూ.

''అవున్రా కృష్ణా! ప్రస్తుతం నే నున్న వాతావరణంలో నా చుట్టూరా వున్న నా స్థాయి మనుషుల మధ్యలో నా నా పిల్లలు పెరగటం నాకు సుతరామూ నచ్చలేదు. కచ్చికతో పళ్ళు తోముకొచ్చా దని—వాడి స్నేహితుడింట్లో, చిన్న వెధ వవి పళ్ళు రాలేలా కొట్టిందో తల్లి! టూత్‌పేస్ట్. బ్రష్‌మీద వేస్తే తప్ప ... అది లేకుంటే పాచిపళ్ళతో ''బ్రేక్‌ఫాస్ట్'' తీసుకోవటం తప్ప...కచ్చికతో పళ్ళు తోముకోవడ మన్నది నీచాతినీచమైన విషయం! అసలా కచ్చికంటే ఏమిటో తెలియదు వాళ్ళకి!

స్విమ్మింగ్‌పూల్‌లో సైరు సాయంతో తప్ప....చిన్నమడుగులో కాలుజారిపడితే బయటకు రాలేని అర్భకులానాగరికులు..

గేదెకూ, దున్నపోతుకూ, గొర్రెకూ. మేకకూ తేడా తెలీని పెంపకాలు! 'బగ్స్' అంటూ ఎగిరిపడటమే తప్ప నల్లిని కాలి తోనో, వేలితోనో చంపగల ధైర్యమైనా లేని వెధవలు!

షో కేస్‌లో అందంగా అమర్చటానికి పనికివచ్చే గాజుబొమ్మలే తప్ప....ఆ షో కేస్‌ను పగలగొట్టటంగానీ, తయారు

చెయ్యటంగానీ చేతరాని చవటలు....

ఛీ ...ఛీ.... నా పిల్లలను అక్కడే వుంచితే....అలా పెంచక తప్పదు.... అందులోనూ డబ్బు సంపాదించటం అవసరంలేని పరిస్థితిలో...ప్రకృతికి దూరంగా ....ప్రకృతిలోని ఏ అణువూ పరిచయం లేకుండా ...చూపులకు మాత్రం నాజూకుగావుండే గాజుబొమ్మలుగా తయారయిపోతారు.... వాళ్ళకు "కండ" వుంటుందేమోగానీ "గుండె" వుండదు.. "మెదడు' వుంటుందేమోగానీ "మేధ" వుండదు...."ఆలోచనలు" వుంటయేమోగానీ ఆచరణలో పెట్టగల "ఆత్మవిశ్వాసం' వుండదు. "మురికి" లేకపోవచ్చుగానీ "పిరికిదనం" మస్తుగా వుంటుంది.

మా వూరూ మారిపోయింది....అంటే ప్రకృతి రో, పరిసరాలూ మారలేదు.... మనుషులు మారిపోయారు .... మరలకు దగ్గరగా వచ్చారు....మా నాన్నగారు.... బాగా పెద్దవారైపోయారు.... ఆయనకు తెలుసు....పిల్లలెలాటి వాతావరణంలో పెరగాలి? ఎలా మనుషులుగా రూపొందాలి? అన్నది....అందుకే....ఆయన తన యావదాస్తీ.... "ప్రకృతి బాలల ఆశ్రమంగా" రూపొందించారు....అది మాకు నమ్మకమైన మనుషులచేత....నడపబడుతోంది....జీవితానికి నిజంగా అవసరమైన చదువేదో అది ముఖ్యంగా నేర్పుతుంటారు పిల్లలక్కడ.... మామూలు చదువూ చెబుతారు...ఇక డిగ్రీ చదువుల కోసం "షరా మామూలు" పద్ధతులు వుండనేవుండె దేశమంతటా! డిగ్రీలు ఎక్కడేనా తెచ్చుకోవచ్చు!

అందుకే నా పిల్లల్ని అక్కడ వదిలి వచ్చాను .ఆ స్వేచ్ఛలో క్రమశిక్షణా వుంది....కానీ అది వారిని మనుషులుగా మలిచేందుకు మాత్రమే ఉపకరిస్తుంది గానీ....చేయి తగిలితే, పొరబాటున జారి పడితే ముక్కలయ్యే గాజుబొమ్మలుగా మాత్రం మార్చదు" విజయ విసుగ్గా లోపలికి వెళ్ళిపోయింది ... బహుశా జీవన్‌కు పిచ్చిపట్టిందని రూఢి చేసుకుని వుంటుంది.... బహుశా జీవన్‌లాటి . రామారావులాటివాళ్ళు వరసగా తమ పిల్లలను అలా పంపిస్తే...విజయ కూడా అదే ఫాషననే ఉద్దేశ్యంతో మాత్రమే ఆచరిస్తుందేమో .కానీ ఆ మంచి పద్ధతి ఫాషన్ క్రిందికి మారి, మా విజయ మనసు మారేసరికి....మా పిల్లలు ... మేము అమర్చిపెట్టిన "షో కేస్' లో అందమైన "గాజుబొమ్మలు"గా మారిపోతారు....ఇది నిజం.

